క్లుప్తంగా

నియోజకవర్గ యూత్ అధ్యక్షుడిగా సందీప్ గెలుపు


సందీప్


మహేష్‌గౌడ్

కాటారం : రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో మండలానికి చెందిన పలువురు పోటీ చేయగా గెలుపొంది పదవులు కైవసం చేసుకున్నారు. మండల కేంద్రానికి చెందిన చీమల సందీప్ మంథని నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, ధన్వాడకు చెందిన చీటూరి మహేష్ గౌడ్ కాటారం మండల యూత్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. త మ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, యూత్ నాయకులు శ్రీనుబాబు సందీప్, మహేష్ కృతజ్ఞతలు తెలిపారు. వీరి నియామకంపై మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా నగేశ్‌యాదవ్


నగేష్‌యాదవ్

కాళేశ్వరం : మహదేవపూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అన్నారం గ్రామానికి చెందిన పర్వతేని నగేశ్ యాదవ్ గురువారం నియామకమయ్యారు. ఆయన నియామకానికి కృషి చేసిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఆయన సోదరుడు శ్రీనుబాబు, మండల పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నగేశ్‌యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా అశోక్

రేగొండ(కొత్తపల్లిగోరి): కొత్తపల్లిగోరి మండల కాంగ్రెస్ యువజన పార్టీ అధ్యక్షుడిగా జూపాక అశోక్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఓట్లు వేసిన యువజన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

భూపాలపల్లి అధ్యక్షుడిగా శరత్ పటేల్

భూపాలపల్లి రూరల్: యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా మండలంలోని ఆజాంనగర్‌కు చెందిన బొడిగె శరత్ పటేల్ ఎన్నికయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఎన్నికల్లో మండలం నుంచి పోటీలో నిలిచిన ఆయన 3036 ఓట్లు సాధించారు. తన ప్రత్యర్థిపై 1776 ఓట్లు అధిక్యాన్ని సాధించారు. పార్టీ శ్రేణులు అందరిని కలుపుకొని ముందుకు సాగుతానని స్పష్టం చేశారు.

నేలను సంరక్షించుకోవాలి



మల్హర్: మానవాళికి ఆహారం అందించే నేలను సంరక్షించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీజ అన్నారు. ప్రపంచ మృత్తిక (నేల) దినోత్సవం సందర్భంగా మండలంలోని కొయ్యూరు రైతు వేదికలో భాగంగా గురువారం ఆమె మాట్లాడుతూ రైతులకు నేలపై ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువులు పెంచాలన్నారు. నేల ఎంత సారవంతంగా ఉంటుందో మనకు పంట దిగుబడి అంతే బాగుంటుందని అవగాహన కల్పించారు. నేల స్వభావాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉందన్నారు. వరికొయ్య కాళ్లను కాల్చకుండా ఉండాలని రైతులను సూచించారు. నేల విలువ గుర్తించడానికి డిసెంబర్ 5న ప్రపంచ మృత్తిక (నేల) దినోత్సవం జరుపు కోవడం జరుగుతుందని వెల్ల డించారు. ఏ ఈఓలు శిరీష, పవిత్ర, సంధ్య, పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు బియ్యం అందజేత

టేకుమట్ల : మండలంలోని అంకుషాపూర్, సోమనపల్లి గ్రామాలకు చెందిన పొందాల లచ్చమ్మ, మారెపల్లి పోశమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా గురువారం వారి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ పరామర్శించారు. వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు బియ్యాన్ని అందించి భరోసా కల్పించారు. ఆయన వెంట గ్రామ శాఖ అధ్యక్షుడు అల్లం ఓదెలు, నూనేటి రమేష్, గోనెపల్లి సంపత్, శ్రీకాంత్, నానవేని రాజు, అంబాల ఆనంద్, మంద రవి, కుమ్మరి దేవక్క, అల్లం సతీష్, తదితరులు ఉన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

టేకుమట్ల : మండలంలోని రాఘవాపూర్‌కు చెందిన బావుసేని శ్రీనివాస్ గత ప్రేఇటీవలే తన సెల్‌ఫోన్ పోగొట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న ఫోన్‌ను గురువారం గుర్తించి బాధితుడికి ఎస్సై సుధాకర్ చేతుల మీదుగా అప్పగించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. హెడ్ కానిస్టేబుల్ మల్లన్న, కానిస్టేబుల్ ఉన్నారు.

అధ్వానంగా కేటీపీపీ ఆస్పత్రి

- మందులు లేవు.. వైద్యులు రారు
- వైద్యం అందక ఇబ్బంది పడుతున్న ఉద్యోగులు
- పట్టించుకోని జెన్‌కో యాజమాన్యం


కేటీపీపీ ప్రాజెక్టు ఆస్పత్రి

గణపురం : పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్టు ఉంది కేటీపీపీ ఆస్పత్రి పరిస్థితి. కనీసం ఫస్ట్ ఎయిడ్ చికిత్స కూడా చేయలేని అధ్వాన స్థితిలో ఉంది. మండలంలోని చెల్పూరు కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రంలో మొదటి దశ 500 మెగా వాట్లు, రెండో దశ 600 మెగా వాట్ల ప్లాంట్లలో మొత్తం 1100 మెగా వాట్లలో విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. ఈ రెండు ప్లాంట్లలో ఇంజనీర్లు, ఆర్టిజన్లు, కార్మికులు, సిబ్బంది కలిసి 6000 వేల మంది ఉంటారు. వీరంతా కేటీపీపీలోని కాలనీలోనే నివాసం ఉంటున్నారు. కేటీపీపీలో పని చేసే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల కోసం మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జెన్‌కో యాజమాన్యం కాలనీల్లో 2008 సంవత్సరంలో ప్రాజెక్టు ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. ప్లాంట్‌లో ఏదైనా ప్రమాదాలు జరిగి ఉద్యోగులు గాయపడితే వైద్యం చేయించుకోవడానికి ఈ ఆస్పత్రికి వెళ్లారు. ప్రాజెక్టు ఆస్పత్రి ప్రారంభించిన కొత్తలో పలు రకాల చికిత్సలకు ప్రత్యేక వైద్యాధికారులతో పాటు సరిపడా సిబ్బంది ఉండడంతో పాటు ల్యాబ్, ఎక్స్‌రే తదితర సౌకర్యాలు సరిపడా మందులు అందుబాటులో ఉండేవి. కానీ ఇప్పుడు ఈ ప్రాజెక్టు ఆస్పత్రి పరిస్థితి చాల అధ్వాన్నంగా మారింది. మందులు లేక వైద్యులు రాక కనీసం ప్రథమ చికిత్స చేయించుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు వైద్య చికిత్సలు చేయించుకోవాలన్నా చేసేదిమిలేక ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు. కోట్ల రూపాయలు వెచ్చించి ఉద్యోగులు, వారి కుటుంబాల సౌకర్యం కోసం నిర్మించిన ప్రాజెక్టు ఆస్పత్రి నిరుపయోగంగా మారుతోంది. ఇప్పటికైనా కేటీపీపీ సీఈ, జెన్‌కో ఉన్నతాధికారులు స్పందించి కేటీపీపీ ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలను అందించి, ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఉద్యోగులు కోరుతున్నారు.


మందులు లేకుండా ఉన్న ర్యాక్

ధాన్యం కొనుగోలు చేయాలి


మాట్లాడుతున్న రైతులు

మల్హర్ : మండలంలోని కొయ్యూరులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు ఆరబోసిన ధాన్యాన్ని నిర్వాహకులు వేగంగా కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు చేయాలని కొయ్యూరు సెంటర్‌లో గురువారం రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్లాల్లో ధాన్యం ఆరబోసి 20 రోజులకు పైగా గడుస్తుందని, తేమ శాతం 17 ఉన్నప్పటికీ నిర్వాహకులు బోనస్‌లు ఇవ్వకుండా ధాన్యం కొనుగోలు చేయడంలో లేదని ఆరోపించారు. గత బుధవారం కురిసిన వర్షంతో కల్లాలోని వడ్లు తడిసిపోయాయని ఆవేదనం వ్యక్తం చేశారు. రోజురోజుకు వస్తున్న మార్పులతో ఆందోళన చెందుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు స్పందించి కొనుగోళ్లు చేపట్టేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మహిళా శక్తి క్యాంటీన్‌ను సద్వినియోగం చేసుకోవాలి


క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ అనిత

టేకుమట్ల : గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రానికి చెందిన వెంకటేశ్వర గ్రూప్‌కు చెందిన చకిలం కావ్యకి మంజూరైన క్యాంటీన్‌ను ప్రజాపాలన సంబురాల్లో భాగంగా ఎంపీడీఓ అనిత ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా స్త్రీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మహిళా శక్తి క్యాంటీన్‌లో తక్కువ ధరలకే టిఫిన్, భోజనం అందిస్తారన్నారు. కార్యక్రమంలో సీసీ మంజుల, మండల సమైక్య అధ్యక్షురాలు సమత, కార్యదర్శులు, కోశాధికారులు, వీఓఏలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పథకాలపై కళాకారుల విస్తృత ప్రచారం


ప్రచారం చేస్తున్న కళాకారులు

కాళేశ్వరం: ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరే విధంగా ప్రజా కళాయాత్ర తెలంగాణ సాంస్కృతిక సారధి కళాబృందం ఓసపాక కుమార్ నేతృత్వంలో గురువారం ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. మహదేవపూర్ మండలం అన్నారం, చండ్రుపల్లి గ్రామాల్లో ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఆరు గ్యారంటీల పై ప్రజలకు అర్థమయ్యే విధంగా వారి ఆటపాటల ద్వారా ప్రజలను చైతన్యపరిచేలా కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన ఏర్పడిందని డీ.ఎస్.బీ సాంస్కృతిక విభాగం మంథని డివిజన్ అధ్యక్షుడు రాజ్ సదవల్ అన్నారు. కార్యక్రమంలో సొదారి సురేందర్, ఆత్మకూరి మహేందర్, కమ్మల ప్రవీణ్ కుమార్, దీకొట్ల శంకర్, మధుబాబు, సుమలత, స్వాతి, రాధిక శిరీష, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

శుద్ధమైన తాగునీటిని అందించాలి

- కాటారం ఎంపీడీఓ బాబు


వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న ఎంపీడీఓ బాబు


నీటిని చూపిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరీశ్

కాటారం: ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ బాబు సూచించారు. ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాల్లో భాగంగా గురువారం స్థానిక పీహెచ్‌సీ ఆవరణలోని తాగునీటి సరఫరా ట్యాంక్‌ను ఆయన పరిశీలించారు. ట్యాంక్ నీటిసామర్థ్యం, నరఫరా తదితర అంశాలపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వాటర్‌ట్యాంక్ శుభ్రం చేయడం, నీటి సరఫరా, మిషన్ భగీరథ తాగునీరు, ఆర్‌ఓ నీరు గురించి సిబ్బందికి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఎప్పటికప్పుడు వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేయాలని ఆదేశించారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

మండలంలోని దేగులగూడెం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఎంపీడీఓ బాబు, ఎంపీఓ వీరాస్వామి పరిశీలించారు. కేంద్రంలోని గదులు, విద్యుత్ సౌకర్యం, ర్యాంప్ ఏర్పాటు, బూతుల వారీగా ఓటర్ల సంఖ్య తదితర అంశాలపై ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

టేకుమట్ల: గ్రామాల్లోని ప్రజలకు శుద్ధమైన నీటి సరఫరా లక్ష్యంగా పని చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరీశ్ అన్నారు. గురువారం ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా టేకుమట్ల, మండలంలోని ఓహెచ్‌ఎస్‌ఆర్ పరిసరాల పరిశుభ్రత, క్లోరినేషన్ టెస్ట్‌లతో పాటు ఓపెన్ వెల్ క్లోరినేషన్ చేయించారు. అనంతరం మాట్లాడుతూ నిత్యం ప్రజలకు మంచినీటిని సరఫరా చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. నిత్యం మండలంలోని అన్ని గ్రామాల్లో క్లోరినేషన్ ప్రక్రియ కొనసాగిస్తామని ఆయన అన్నారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది ఉన్నారు.

30ఏళ్ల పోరాట ఫలితమే వర్గీకరణ

- ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి కేసారపు నరేశ్


సమావేశంలో మాట్లాడుతున్న నరేశ్

మల్హర్ : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ 30 ఏళ్ల పోరాట ఫలితంతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి కేసారపు నరేశ్ అన్నారు. గురువారం మండల కేంద్రం తాడిచర్లలో నరేశ్ మాదిగ అధ్యక్షతలో ఎస్సీ వర్గీకరణ వర్గీకరణ కులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ వర్గీకరణలను ఈ భారత సమాజం ద్రోహాలుగాని చూస్తుందని, మందకృష్ణ మాదిగను విమర్శిస్తే మాదిగ, మాదిగ ఉపకులాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు చూస్తూ ఊరుకోరని తెలియజేశారు. ఎస్సీ వర్గీకరణ జరిగితేనే ఎస్సీల్లో ఉన్న అన్ని వర్గాలకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తాండ్ర మల్లేష మాదిగ, సీనియర్ నాయకులు కేసారపు చంద్రయ్య, పులిగంటి నరసయ్య, ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి తాండ్ర దినేష్, మాదిగ యూత్ మండల ప్రధాన కార్యదర్శి ఇందారపు అరుణ్, కుమార్, పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులతో యువకుడి మృతి

మొగుళ్లపల్లి: అత్తింటివారు తిట్టడంతో అల్లుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రాయిశెట్టి రాజ్‌కుమార్(26)కు మండలంలోని పోతుగల్లుకు చెందిన కొంతం నరయ్య, రాజేశ్వరి దంపతుల కూతురు రమ్యతో ఏడాదిన్నర క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కూతురు. కాగా, మంగళవారం రాజ్‌కుమార్ తన కూతురు పురుడు (21వ రోజు) కార్యక్రమానికి కుటుంబ సభ్యులతో అత్తగారింటికి వెళ్లాడు. కార్యక్రమం అనంతరం అత్తమామ రమ్యను పంపకపోవడమే కాక రాజ్‌కుమార్‌ను ఇష్టం వచ్చినట్లు తిట్టారు. దీంతో మనోవేదనకు గురైన రాజ్‌కుమార్ బుధవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి మొగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

'కోతుల నివారణకు చర్యలు తీసుకోండి'


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాళేశ్వరం : మహదేవపూర్ మండల కేంద్రంతో పాటు వార్డుల్లో పలు పంచాయతీల్లో కోతులు విచ్చలవిడిగా స్వైరవిహారం చేస్తూ పిల్లలను, వృద్ధులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేశ్ అటవీశాఖ రేంజర్ రవికి వినతి పత్రం అందజేశారు. గురువారం కార్యాలయానికి వెళ్లి కోతుల బెడదపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఫారెస్ట్ అధికారులు స్పందించి కోతులు గ్రామాల్లో రానివ్వకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని వినతిలో కోరారు. ఆయన వెంట ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ధర్మయ్య, లింగాల సమ్మయ్య, సమ్మయ్య, మండల మాదిగ యువసేన మండల అధ్యక్షుడు మంథని రవితేజ, మండల ప్రధాన కార్యదర్శి లింగాల నిఖిల్, చింతకుంట్ల సదానందం, లింగాల సుకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ సభను జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి

చిట్యాల: ఈనెల 8న మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో జరిగే విజయోత్సవ బహిరంగ సభను జయప్రదం చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుట్ల తిరుపతి కోరారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, జిల్లా మంత్రులు హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని నాయకులు కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి-సత్యం, జిల్లా, మండల నాయకులు గడ్డం కొంరయ్య, దొడ్డి కిష్టయ్య, రాయకొంర, కామిడి రత్నాకర్‌రెడ్డి, మహిళా మండల అధ్యక్షురాలు మేరుగు లక్ష్మి, బుర్ర లక్ష్మణ్, శ్రీనివాస్, అనిల్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరి మృతి

మరొకరికి తీవ్రగాయాలు


కుమారస్వామి (ఫైల్)

కాటారం : రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదం గురువారం మహముత్తారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లికి చెందిన పిల్లి కుమారస్వామి(38) పనుల నిమిత్తం మహముత్తారం మండలం సింగారం మీదుగా ద్విచక్ర వాహనంపై వచ్చి వెళ్తున్నాడు. ఈ క్రమంలో భూపాలపల్లి మండలం పందిపంపులకు చెందిన దామెర రమేశ్ కాటారం వైపు నుంచి సింగారం వైపునకు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. సింగారం సమీపంలోని మలుపు వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో కుమారస్వామి, రమేశ్ తీవ్రగాయాలపాలవ్వగా గమనించిన ఇతర వాహనదారులు ఇరువురిని చికిత్స నిమిత్తం ములుగు ఆస్పత్రికి తరలించారు. కుమారస్వామి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రమేశ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. మహనా ఫ్యామిలీ మహముత్తారం పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష


దీక్షలో పాల్గొన్న ధర్మ సమాజ్ పార్టీ నాయకులు

భూపాలపల్లి రూరల్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందించాలని, రాజ్యాంగాన్ని అనుసరించి పాలన చేయాలని, జిల్లా కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తూరి రవీందర్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారం నాటికి 8వ రోజుకు చేరుకున్నాయి. దీక్షను బీసీ జిల్లా నాయకులు నారుని సత్యనారాయణ, చంద్రగిరి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీందర్ ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కండె రవి, చిట్యాల శ్రీనివాస్, శీలపాక నాగరాజు, పుల్ల ఆశోక్, దూడపాక రాజు, వంగ మహేష్, దూడపాక శ్రీకృష్ణ, పుల్ల తిరుపతయ్య పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

మొగుళ్లపల్లి: పోల్ డ్యామేజీతో ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని గ్రామ రైతులు గిరబోయిన రాజకొమురు, దర్శనపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని బీజే ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో గురువారం ఈ విషయంపై సబ్ ఇంజనీర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్లారెడ్డిపల్లిలో ఎస్ఎస్, 1100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి శ్రీ పేటకు వచ్చే దారిలో వ్యవసాయ బావి వద్ద సర్వేస్ నెంబర్ 145, ఏబీఎల్ కొక్కెన్ పోల్ ఉంది. 2023 అధిక వర్షాలతో బావి కూలి పోయింది. పోల్ కూలిపోయే ప్రమాదం ఉందని సంబంధిత అధికారులకు విన్నవించినా స్పందించలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పోల్ వర్క్ చేయాలని రైతులు కోరుతున్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

- సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మల్లేష్


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి మల్లేశ్

మొగుళ్లపల్లి: మండలం మట్టూ ఉన్న వాగుల్లో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను రూల.. ఇసుకను తోడేస్తున్నారని ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని రంగాపురం, ఇస్సిపేట, మేదరమెట్ల, అంకుషాపురం, ముకులకపల్లి, మొగుళ్లపల్లి, బంగ్లాపల్లి, వేములపల్లి, పోతుగల్లు గ్రామాల సమీపంలోని వాగుల నుంచి ఇసుక అక్రమ రవాణా దందా యథేచ్ఛగా కొనసాగుతున్నారు. చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల ట్రాక్టర్ యజమానులు ఒక ముఠాగా ఏర్పడి ఈ దందాను కొనసాగిస్తున్నట్లు ఆరోపించారు. రాత్రింబవళ్లు అనే తేడా లేకుండా ఈ ఇసుక దందా కొనసాగుతున్నారని ..కొందరు వ్యక్తులు ఈ ఇసుక దందాకు పైరవీలు గా వ్యవహరిస్తూ..ఇసుక దందా ముఠాకు అధికారుల సమాచారాన్ని చేరవేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇసుక దందా ముఠాకు సహకరించే వారిని గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు స్పందించి అక్రమ ఇసుక రవాణాను నియంత్రించాలన్నారు.

వ్యాధులబారి నుంచి రక్షించుకోవాలి

టేకుమట్ల : అన్ని రకాల వ్యాధుల బారి నుంచి పాడి రైతులు పశువులను రక్షించుకోవాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ వివేక్ అన్నారు. గురువారం మండలంలోని దుబ్యాలలో జిల్లా పశుసంవర్ధక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన పశువులకు వైద్యం చేసి, మందులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పశువులకు సకాలంలో నట్టల మందులు వేయాలని, నిత్యం చూస్తూ పశువులు వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎదకు రాని, తెల్ల, నల్ల జాతి పశువులు గర్భకోసంచాను బారిన పడకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో టేకుమట్ల పశు సంపద సహాయకులు దాసరి శంకర్, జిల్లా పశు సంపద అభివృద్ధి సంస్థ సూపర్‌వైజర్ ప్రకాష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రవి, గోపాల మిత్రలు మేకల కుమార్, రాజేందర్, అనిత, తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ నిర్వహణపై సమావేశం


మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్లు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలో సీఎం కప్ నిర్వహించుటకు ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, పీఈటీలకు అవగాహన సదస్సు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామ పంచాయతీల్లో ఉత్సాహవంతులైన క్రీడాకారులు సీఎం కప్ క్రీడల్లో పాల్గొనేందుకు http://cmc up2024.te a nfa na.gov.in పోర్టల్ నందు అథ్లెటిక్స్, ఫుట్ బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, యోగ వంటి క్రీడలలో నైపుణ్యం ఉన్న క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని లేదా సంబంధిత గ్రామపంచాయతీలో పంచాయతీ కార్యదర్శిని సంప్రదించి వివరాలు అందించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడాకారులతో ఈనెల 7 , 8 తేదీల్లో గ్రామ పంచాయతీ క్రీడాకారులకు కాళేశ్వరంలో క్రీడలు నిర్వహించనున్నామని తెలిపారు. గెలుపొందిన అభ్యర్థులతో ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు, మండల స్థాయిలో జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ కాంప్లెక్స్ మహదేవపూర్‌లో పోటీలు నిర్వహిస్తారు. సమావేశంలో ఎంఈఓ ప్రకాష్‌బాబు, పీఈటీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాళేశ్వరాలయంలో ప్రజాపాలన దినోత్సవం


శ్రీవిజయ గణపతికి పూజలు చేస్తున్న అర్చకులు

కాళేశ్వరం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన దినోత్సవాల్లో భాగంగా కాళేశ్వరాలయంలో శ్రీవిజయ గణపతి, శ్రీకాళేశ్వర ముక్తీశ్వరునికి ప్రత్యేక అభిషేక పూజలను ఉప ప్రధాన అర్చకుడు ఫణీంద్రశర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, అర్చకులు పాండా, సుబ్రహ్మణ్యశర్మ, ఫణి, శ్రవణ్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.